ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 14 మార్చి 2025

ఉచిత డీఎస్సీ శిక్షణకు 115 మంది ఎంపిక

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత డీఎస్సీ శిక్షణకు 115 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ ఆప్షన్‌లో కోచింగ్ సెంటర్‌ను ఈ నెల 15వ తేదీలోగా ఎంపిక చేసుకోవాలని తెలిపారు. త్వరలో శిక్షణ ప్రారంభం కానుందన్నారు. మరిన్ని వివరాలకు జ్ఞానభూమి.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ పోర్టల్‌ను సందర్శించాలని కలెక్టర్ సూచించారు.



శ్రీకాకుళంలో హోలీ రంగుల విక్రయం..

నేడే రంగుల పండగ

- హోలీ వేడుకలకు సిద్ధం
- సహజ వర్ణాలనే వినియోగించండి
- రసాయనాలతో ఆరోగ్యంపై ప్రభావం

శ్రీకాకుళం అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వసంత రుతువు ప్రారంభంలో వచ్చే రంగుల పండుగ హోలీ. భారతీయ సంస్కృతిలో ఎంతో ప్రత్యేకమైన ఈ వేడుకలను శుక్రవారం నిర్వహించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. ఆనందం, స్నేహం, శాంతి, సామరస్యంగా చేసుకునే ఈ పండుగలో ఒకప్పుడు సహజసిద్ధమైన రంగులు వినియోగించేవారు. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన హానికర రసాయనాలతో తయారుచేసిన రంగుల వల్ల ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతోంది. సహజ సిద్ధమైన రంగులు వినియోగిస్తే ఆనందంతో పాటు ఆరోగ్యం మన సొంతమవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

సహజ రంగులతో మేలు

ప్రకృతి సిద్ధంగా తయారు చేసుకునే సహజ రంగులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి సులభంగా ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.

- పసుపు రంగు: సెనగపిండి, పసుపు పొడిని నీళలో కలిపి రంగులు చల్లుకోవచ్చు.
- గులాబీ రంగు: బీట్‌రూట్ రసం, లేదా రోజ్ పింక్ ఫ్లవర్స్ పేస్ట్‌ను నీళ్లలో కలిపి వాడటంతో ముఖ సౌందర్యం మెరుగుపడుతుంది.
- ఆకుపచ్చ రంగు: పాలకూర, లేదా మెంతి ఆకుల పేస్ట్ నీళ్లలో కలిపి చల్లడం వల్ల చర్మం సౌందర్యవంతంగా కనిపిస్తుంది.
- నీలం రంగు: నీలాకొలలు పువ్వుల పొడితో మరింత ఆరోగ్యం.
- ఎరుపు/ఆరెంజ్ రంగు: మందార పువ్వులతో తయారు చేసిన రంగులు చర్మానికి హానికరం కాదు. చిన్న పిల్లలు, వృద్ధులు కూడా సంతోషంగా ఈ సహజ రంగులు వేసుకోవచ్చు.

రసాయన రంగుల భూతం

ప్రస్తుతం సౌకర్యం కోసం కొనుగోలు చేసే రంగుల్లో లెడ్, క్రోమియం, మెర్క్యూర్, కాడ్మియం వంటి రసాయనాలు ఉంటున్నాయి. దీంతో చర్మం మీద అలర్జీ, దద్దుర్లు, ఇన్ఫెక్షన్‌లు కలిగే అవకాశం ఉంటోంది. కళ్లకు హాని చేయడంతో పాటు, శ్వాసకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. చిన్నపిల్లల్లో ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. పర్యావరణానికి కూడా ఈ రంగులు హాని చేస్తాయి. నీరు, నేల, కాలుష్యానికి దారి తీస్తాయి.

సహజ రంగులతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



హోలీ రోజున వాడే రసాయన రంగులతో కళ్లకు హాని జరిగే అవకాశం ఎక్కువ. కళ్లు ఎర్రబారడం, కళ్లలో నీరు కారడం, ఇరిటేషన్, కార్నియా దెబ్బతినడం, శ్వాసకోస వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇవి చిన్నారులలో ఇంకా వేగంగా ప్రబలుతాయి. ప్రకృతి సిద్ధమైన కూరగాయలు, ఆకులు, పువ్వులతో తయారు చేసే రంగులు వినియోగించడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

- పీఎల్ఎన్ రాజు, కంటి వైద్యులు



హోలీ వేడుకలు (ఫైల్)

ఐక్యతను చాటిచెబుతుంది



హోలీ పండుగ మనుషుల్లో ఐక్యతను చాటి చెబుతుంది. జిల్లాలోని మార్వాడీ కుటుంబాలతో పాటు భారతీయులు ఈ పండుగను సంతోషంగా చేసుకుంటారు. రసాయన రంగులకు దూరంగా ఉంటాం. సహజ సిద్ధమైన రంగులకే మా ప్రాధాన్యం.

- బాబూలాల్ పొద్దార్, వ్యాపారవేత్త, శ్రీకాకుళం

సహజ రంగులే వినియోగిస్తాం



జిల్లాలో 100కు పైగా మార్వాడీ కుటుంబాలు హోలీ పండుగను చేసుకుంటాయి. ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటాం. పర్యావరణ పరిరక్షణ కోసం చాలా కాలం క్రితమే మార్కెట్‌లో దొరికే రసాయన రంగులను వినియోగించడం మానేశాం. సహజ సిద్ధమైన హెర్బల్ రంగులను మాత్రమే వినియోగిస్తున్నాం.

- సంజయ్ కుమార్ అగర్వాల్, వ్యాపార వేత్త, శ్రీకాకుళం

హోలీ పండుగ ప్రత్యేకమైనది



ఏటా శివరాత్రి తరువాత రోజు నుంచి ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది ఒక్కో పిడకను తయారు చేసి..దండగా అల్లుతారు. ఇంట్లో ప్రత్యేక పూజలు చేసి హోలీ ముందు రోజు మంటలు వేస్తాం. సహజ సిద్ధంగా దొరికే కూరగాయలు, హెర్బల్స్‌తో తయారయ్యే రంగులనే వినియోగిస్తున్నాం.

- పూజా అగర్వాల్, గృహిణి, శ్రీకాకుళం

ప్రశాంతంగా హోలీ వేడుకలు:ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, మార్చి13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో, ఆనందంగా చేసుకోవాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు గురువారం ఓ ప్రకటనలో ఎస్పీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండగ నాడు ప్రజలు ఎటువంటి గొడవలు, అల్లర్లు, సమస్యల జోలికి పోవద్దని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తించవద్దని, ఆకతాయి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. కలుషితమైన, ప్రమాదకరమైన రంగులు వినియోగించవద్దని, పర్యావరణ హితమైన రంగులు మాత్రమే వాడాలని ఎస్పీ తెలిపారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్‌లు తొలగించి అతివేగంగా, పెద్ద శబ్దంతో నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.





గోడ మీద నుంచి దూకేందుకు సిద్ధమైన నరసింహం

- రిమ్స్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- మూడో అంతస్తు గోడపైకి ఎక్కి హల్‌చల్
- కాపాడిన ఆస్పత్రి సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు
- మతిస్థిమితం లేనట్టు గుర్తించిన వైద్యులు

దూకేస్తున్నా.. మా వాళ్లకు చెప్పండి



నరసింహానికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై.. కుటుంబ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఓ వ్యక్తి.. శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్- రిమ్స్)లో ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన కలకలం రేపింది. పోలీసులు, రిమ్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం నక్కలవానిపేటకు చెందిన సనపల వరహ నరసింహం(39) మద్యానికి బానిసై.. కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. గురువారం సాయంత్రం 4గంటల సమయంలో ఆయన రిమ్స్‌కు చేరుకు న్నాడు. అక్కడ మూడవ అంతస్తు గోడపైకి ఎక్కాడు. అక్కడ నుంచి 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. ఇక్కడ నుంచి దూకేస్తున్నా.. నా కుటుంబ సభ్యులకు చెప్పండి' అంటూ కేకలు వేశాడు. గోడ దూకే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో అక్కడ పనిచేస్తున్న ఆస్పత్రి సిబ్బంది రవి, జనార్దనరావు, మోహనకృష్ణ, రామారావు అతడిని గమనించి కాపాడేందుకు ప్రయత్నించారు. అతడితో మాట్లాడుతూ ఏం జరిగిందో కనుక్కుంటూనే.. మరోవైపు రెండవ పట్టణ పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి కూడా సమాచారం అందించారు. సీఐ పి.ఈశ్వరరావు, పోలీసులు, ఏడీఎఫ్‌వో వరప్రసాద్, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. వారిని చూసి వరహనరసింహం గోడమీద నుంచి దూకేయడానికి ప్రయత్నించగా.. అప్పటికే అక్కడ ఉన్న రిమ్స్ సిబ్బంది రవి, జనార్దనరావు, మోహనకృష్ణ, రామారావు అతడి (మిగతా 6వ పేజీలో..)

మాస్టారూ.. మీరు మారరా?



విచారణ చేస్తున్న డీఈవో, విద్యాశాఖ అధికారులు

- విద్యార్థినుల పట్ల అసభ్యకర ప్రవర్తన
- విద్యాశాఖ అధికారులకు బాధితుల ఫిర్యాదు
- డీఈవో విచారణ.. విధుల నుంచి తొలగింపు
- ఇప్పటికే ఒకసారి సస్పెన్షన్.. తాజాగా మరోసారి..
- ఇదీ పెద్దసాన పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడి తీరు

టెక్కలి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆయనో తెలుగు ఉపాధ్యాయుడు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఆయన.. వారితో అసభ్యంగా ప్రవర్తించాడు. ద్వంద్వ అర్థాలతో మాట్లాడుతూ.. విద్యార్థినుల భుజాలపై తాకుతూ.. వికృత చేష్టలకు పాల్పడేవాడు. ఇలా వ్యవహరించి.. ఇప్పటికే ఓ పాఠశాలలో ఒకసారి సస్పెండ్ అయ్యాడు. మరోసారి అధికారులను బతిమిలాడుకుని వేటు నుంచి తప్పించుకున్నాడు. మరో పాఠశాలకు బదిలీ అయ్యాడు. అయినా ఆయన తీరు మారలేదు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో కూడా విద్యార్థినులతో అసభ్యకర రీతిలో వ్యవహరించడంతో వారు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. డీఈవో విచారణ చేపట్టి.. ఆయనను మందలించి మరోసారి సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే..

టెక్కలి మండలం పెద్దసానలోని ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు ఎలుగు ప్రసాద్ వికృత చేష్టలు అన్నీఇన్నీ కావు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకూ 85 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకూ 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థినులతో తెలుగు మాస్టర్ ప్రసాద్ అసభ్యంగా ప్రవర్తించేవారు. దీంతో వారంతా మూకుమ్మడిగా 8 పేజీల లేఖను రాసి ఉపాధ్యాయుడి తీరుపై మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంఈవో ఈ విషయాన్ని డీఈవో తిరుమల చైతన్య దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం డీఈవో తిరుమల చైతన్య, డిప్యూటీ డీఈవో విలియమ్స్, ఇతర అధికారులు విచారణ చేపట్టారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఈ ఘటనపై ఆరా తీశారు. ఉపాధ్యాయుడు ప్రసాద్ ద్వంద్వ అర్థాలతో బూతులు మాట్లాడుతున్నారని, బండిపై వస్తావా.. అని పలుసార్లు అడుగుతుంటారని, అసభ్యకరంగా తమను తాకుతున్నారని చెబుతూ విద్యార్థినులు ఏడుస్తూ తమగోడు వెళ్లగక్కారు. అటువంటి ఉపాధ్యాయుడు తమకు వద్దంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అధికారులకు మొర పెట్టుకున్నారు. దీనిపై ఆ ఉపాధ్యాయుడ్ని డీఈవో ప్రశ్నించగా.. తాను ఏ తప్పూ చేయలేదని (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా

చట్టాలపై అవగాహన పెంచుకోండి

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో గురువారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో వెట్టిచాకిరీ నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిషేధ చట్టాలపై ప్రజలకు అవగాహన పెరగాలన్నారు. అనంతరం వెట్టిచాకిరీ నిర్మూలన, మానవ అక్రమ రవాణా చట్టంపై వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సదస్సులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ లేబర్ కమిషనర్ కె.అజయ్ కార్తికేయ, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి, బాలల సంక్షేమ అధికారి శ్రీలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తం

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

అరసవల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినం సందర్భంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్) వద్ద అవగాహన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. మరో 5 డయాలసిస్ కేంద్రాలను కూడా మంజూరు చేయనుందని తెలిపారు. ఆసుపత్రి కిడ్నీ వ్యాధి నిపుణుడు డాక్టర్ రమేష్ మాట్లాడుతూ 'కిడ్నీ వ్యాధి రావడానికి 60 శాతం బీపీ, షుగర్ వ్యాధులే కారణం. వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. ఆల్కహాల్, పొగ తాగడం చేయరాదు. ఉద్దానం ప్రాంతంలో వచ్చే కిడ్నీ వ్యాధులకు ఇతర కారణాలు ఉన్నాయని పరిశోధనలో తేలింది. ఆ ప్రాంతంలోని వారికి వ్యాధి లక్షణాలు మొదట్లో కనబడవు. కాళ్లవాపు, అలసట తదితర లక్షణాలు ఉండవు. అనుమానం వచ్చి పరీక్షలు చేస్తే క్రియాటినిన్ 3 లేదా 4 ఉంటోందని తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కల్యాణ బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షకీల, డీఎంహెచ్‌వో డాక్టర్ బాలమురళీకృష్ణ, డాక్టర్ రమేష్‌చంద్ర, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శరత్ జ్యోత్స్న, వైద్యులు, మెడికల్ కళాశాల అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



తామరాపల్లి వద్ద హైవేపై పొగమంచు

జమ్ము గ్రామం వద్ద మంచు పొరల్లో సూరీడు

మంచు దుప్పటి

ఒక పక్క ఎండల తీవ్రత పెరుగుతోంది.. మరోపక్క పొగమంచు వదలడం లేదు.. దీంతో ఇటు వాహనదారులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం తెల్లవారు జాము నుంచి ఉదయం 7.30 గంటల వరకు హైవేపై పొగమంచు దట్టంగా అలముకోవడంతో ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొన్నారు. ఇంటర్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు కేంద్రాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. హైవే 16తో పాటు అంతర్రాష్ట్ర జాతీయ రహదారి-324ఎ పైనా ఇదే పరిస్థితి కనిపించింది. ఉదయం 7.35 గంటలకు మంచు పొరలను చీల్చుకుంటూ సూర్యుడు పైకి రావడంతో వాతావరణం యథాస్థితికి వచ్చింది. మధ్యాహ్నం సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని చూపాడు.

- నరసన్నపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి)



కూర్మనాథుని ఆలయంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు



మత్స్యలేశం తీరంలో భక్తుల సందడి

భక్తుల పవిత్ర స్నానాలు

గార, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన శ్రీకూర్మ క్షేత్రంలో జరుగుతున్న డోలోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం భక్తులు సముద్ర స్నానాలు (పడియ) ఆచరించారు. బుధవారం రాత్రి కామదహన ఉత్సవంలో పాల్గొన్న భక్తులు గురువారం ఉదయం దగ్గరలో ఉన్న మత్స్యలేశం తీరంలో స్నానాలు చేశారు. పితృదేవతలకు ప్రీతిగా పూజలు, దానాలు చేశారు. తీరంలో ఎటువంటి అవాంఛనీ య సంఘట నలు జరగకుండా మెరైన్ సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు.

క్రైం కార్నర్

ఒడిశా టు చెన్నై

● 4 కిలోల గంజాయితో యువకుడి అరెస్ట్


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటఅప్పారావు

హరిపురం మార్చి13 (ఆంధ్రజ్యోతి): మందస రోడ్(హరిపురం) రైల్వే స్టేషన్ పరిధిలో 4 కిలోల గంజాయిని తరలిస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువకుడిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. వివరాలు వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాహుల్ మొండల్ చెన్నైలో టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. డబ్బుపై ఆశతో గంజాయి రవాణాకు చెన్నైకి చెందిన రంజిత్ అనే వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒడిశా రాష్ట్రం పారాదీప్‌లో బాను జెన్నా అనే వ్యక్తి నుంచి కిలో రూ.2500 చొప్పున 4 కిలోలు కొనుగోలు చేసి బరంపురం చేరుకుని రైలులో చెన్నై వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ పోలీసుల నిఘా ఉండడంతో బస్సులో మందస రోడ్ (హరిపురం) వచ్చి చెన్నై వెళ్లేందుకు రైలు కోసం నిరీక్షిస్తున్నాడు. మఫ్టీలో ఎస్ఐ కృష్ణప్రసాద్‌తో పాటు పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీ చేపట్టగా గంజాయి బయట పడింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని గంజాయిని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సీఐ తిరుపతిరావు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నరసన్నపేటలో 4 కేజీల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి హైదరాబాద్‌కు 4 కేజీల గంజాయిని తరలిస్తున్న ఒడిశాకు చెందిన వ్యక్తిని పోలీసులు గురువారం దేవాది గ్రామం వద్ద హైవేపై అరెస్టు చేసినట్లు సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం భద్రక్ జిల్లా పడిసాయి గ్రామానికి చెందిన షేక్ గుల్బాన్ 4 కేజీల గంజాయిని హైదరాబాద్ తీసుకువెళుతున్నాడు. పోలీసులు వాహనాలను పరిశీలిస్తుండగా నిందితుడు వాహనం దిగి పారిపోతుండగా అనుమానం వచ్చి పోలీసులు పట్టుకున్నారు. ఆ వాహనంలో గంజాయిని తీసుకువెళుతున్నట్లు గుర్తించి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు

● ఇద్దరు మహిళలకు గాయాలు

నరసన్నపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్ము ఫ్లైఓవర్‌పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయాలయ్యాయి. నేషనల్ హైవే సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం నుంచి టెక్కలి వెళుతున్న కారు ముందు వెళుతున్న లారీని ఢీకొంది. తాపీమేస్త్రి గణపతి కాలికి శస్త్ర చికిత్స చేసి ఇంటికి కారులో తీసుకువెళుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో గణపతి కుమార్తె పి.పద్మ, భార్య పి.సునీతలకు గాయాలు కాగా డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డారు. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను నేషనల్ హైవే సిబ్బంది అంబులెన్స్‌లో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

హస్తకళలపై విద్యార్థులకు అవగాహన


మట్టి పాత్రలు తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

హరిపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హస్తకళలపై విద్యార్థులకు అవగాహన అవసరమని కుంటికోట నారాయణ హైస్కూల్ డైరెక్టర్ జి.రోహిణీశంకర్ అన్నారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులకు మందస, బీఎస్‌పురం, చిన్నబరంపురం గ్రామాల్లో హస్తకళలపై అవగాహన కల్పించేందుకు గురువారం విజ్ఞానయాత్ర నిర్వహించారు. మందసలో మట్టి, వెదురుతో తయారు చేస్తున్న ఉత్పత్తులు, చిన బరంపురంలో కొయ్యబొమ్మలు, బీఎస్‌పురం నేస్తున్న వస్త్రాలను పరిశీలించి తయారీ, సంరక్షణపై వివరించారు. ఉపాధ్యాయులు అరవింద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి


చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఈవో

పలాసరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని డీఈవో తిరుమల చైతన్య అన్నారు. రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో గురువారం ఎల్‌కేజీ, యూకేజీ విద్య పూర్తి చేసుకుని ఒకటో తరగతిలోకి వెళ్తున్న 54 మంది విద్యార్థులకు కిడ్స్ కాన్వొకేషన్ నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో విలియమ్స్, ఎంఈవో శ్రీనివాసరావు, ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి మల్లా శరత్‌బాబు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో కిడ్నీ వ్యాధి దూరం



కిడ్నీ ఆసుపత్రిలో అవగాహన కలిగిస్తున్న వైద్యులు

పలాసరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ శారీరక వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం వంటి ముందస్తు జాగ్రత్తలతో కిడ్నీ వ్యాధి దూరమవుతుందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. పలాస కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రిలో గురువారం కిడ్నీ వ్యాధి నివారణ దినం సందర్భంగా అవగాహన కలిగించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ మాట్లాడుతూ.. కిడ్నీవ్యాధిపై రోగులు సరైన నియంత్రణ కలిగి ఆహారం, మందులను నిర్ణీత వేళల్లో తీసుకోవాలని, వ్యాయామం, యోగా జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంవో శ్రీహరిబాబు, వైద్యులు యర్ర రాకేష్, రామనరేష్, సుదర్శన్, కావ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి: ఎంజీఆర్



పాతపట్నం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజక వర్గపరిధి మెళియాపుట్టిలోనే ఐటీడీఏ ఏర్పాటు చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో సీతంపేట ఐటీడీఏ మన్యం జిల్లాలోకి వెళ్లి పోయిందన్నారు. ఫలితంగా అత్యధిక గిరిజన ప్రాంతం శ్రీకాకుళం జిల్లాలో ఉండిపోయిందన్నారు. దీంతో జిల్లాలోని గిరిజన సమస్యలు పరిష్కారం కావడం లేదని, అందువల్ల మెళియాపుట్టిలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్నారు. ఎంత కాలంలో దీనిని ఏర్పాటు చేస్తారని గిరిజన సంక్షేమశాఖ మంత్రిని ప్రశ్నించారు. దళారీ వ్యవస్థ లేకుండా గిరిజన ఉత్పత్తులను అమ్ముకొనేందుకు వీలుగా వారాంతపు సంత ఏర్పాటుకు ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు.

అసెంబ్లీలో జిల్లా వాణి

‘టిడ్కో’ రుణాలు చెల్లించాలని బ్యాంకుల ఒత్తిడి

● పలాస ఎమ్మెల్యే శిరీష



పలాస, మార్చి 13(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల కోసం తీసుకున్న రుణాలను చెల్లించాలని బ్యాంకులు లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయని, దీంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ.. ఇళ్లు ఇంత వరకు ఇవ్వలేదని, అయితే రుణాలు తిరిగి చెల్లించాలని ఇబ్బందులు పెడుతున్నారని సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఎప్పుడు గృహాలు కడతారో తెలియని పరిస్థితి ఉందని, బాధితులకు న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

వైసీపీ హయాంలో రీ సర్వేలో అక్రమాలు

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో సారవకోట మండలం కూర్మనాథపురం, రామకృష్ణాపురం గ్రామాల్లో భూముల రీ సర్వేలో అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. కూర్మనాథపురం గ్రామంలో 50 మందికి ఒకే ఖాతా, ఒక వ్యక్తికి రెండు, మూడు ఖాతా నెంబర్లుండడం, ఆధార్ అనుసంధానంలో తప్పులు జరిగాయన్నారు. రికార్డులు, పాస్‌బుక్కుల్లో వేర్వేరు పేర్లపై నమోదయ్యాయని, మరోసారి సర్వే చేసి హక్కుదారులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. రామకృష్ణాపురంలో 133 ఎకరాల పల్లం, 60 ఎకరాల మెట్టు భూములు సాగులో ఉన్నాయని, అయితే పర్లాకిమిడి రాజులకు చెందిన 48 ఎకరాలు పల్లం, పది ఎకరాల మెట్టు భూమిని రాధాకాంతస్వామి పేరున ఇవ్వడం జరిగిందని, గత ప్రభుత్వంలో ఆ భూముల రికార్డులు కూడా మార్పు చేసి రైతుల భూములను దేవాలయం పేరిట మార్చారన్నారు. ఈ రెండు గ్రామాలను ఉదాహరణగా తీసుకుని రీ సర్వే జరిగిన గ్రామాల్లో సమగ్రంగా సర్వే చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు ఊపిరి వచ్చిందన్నారు.

పోర్టు నిర్వాసితులకు ప్లాట్లు కేటాయింపు

సంతబొమ్మాళి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్వాసితులకు ప్లాట్లను టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి లాటరీ ద్వారా గురువారం కేటాయించారు. పోర్టు నిర్మాణంతో గ్రామాన్ని కోల్పోతున్న విష్ణుచక్రం గ్రామస్థులు 80 మందికి నౌపడ పునరావాస కాలనీలో ఇళ్ల నిమిత్తం ప్లాట్‌లను కేటాయించారు. అనంతరం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారు చేయాలి: డీపీవో

సంతబొమ్మాళి,మార్చి13(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేయాలని డీపీవో భారతి సౌజన్య ఆదేశించారు. గురువారం సంతబొమ్మాళి, కోటపాడు గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. సాలివీధిలో తడి, పొడి చెత్తలు సేకరించడంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐ.పద్మజ, సంతబొమ్మాళి కార్యదర్శి దుంప శ్రీనివాసరావు, సర్పంచ్ కళింగపట్నం లక్ష్మీ అప్పారావు పాల్గొన్నారు.

పలాస డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్

పలాస, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహణ, విద్యా బోధనను గుర్తించి విద్యాశాఖ డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ బృందం ఏ-గ్రేడ్‌గా ప్రకటించింది. ఈ మేరకు గురువారం విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకట లక్ష్మి, బారువ, తొగరాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు బి.రాంబాబు, డి.పైడితల్లితో కూడిన బృందం కళాశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి కళాశాల పనితీరు, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

నేటి ‘ప్రజాఫిర్యాదుల స్వీకరణ’ రద్దు

పలాస, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ పండుగ సెలవు దినం కావడంతో రద్దు చేస్తున్నామని, వచ్చే శుక్రవారం నుంచి యథావిధిగా నిర్వహిస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కిడ్నీ వ్యాధితో యువకుడి మృతి


భాస్కర్ (ఫైల్)

టెక్కలి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): టెక్కలి శ్రీనివాస్‌నగర్‌కు చెందిన ఎస్.భాస్కర్(35) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. భాస్కర్ కొంత కాలంగా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో డయాలసిస్ పొందుతున్నాడు. గురువారం ఇంటి వద్ద అస్వస్థతకు గురికాగా.. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

ఐతమ్ విద్యార్థులకు ఐఐఎం ప్రశంసలు



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

టెక్కలి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు టంకాల యమున, బి.జయంత్, సాయి కుమార్, టి.సంతోషిలకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం-బెంగుళూరు) ప్రశంసాపత్రాలను అందించిందని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల ఐఐఎం నిర్వహించిన జాతీయస్థాయి బిజినెస్ ప్లాన్ చాంపియన్‌షిప్ సదస్సులో ఐతమ్ విద్యార్థులు పాల్గొని ఆహార వినియోగంలో భాగంగా డయాక్యూర్ అనే నూతన ఆవిష్కరణ అంశంపై చేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను గుర్తించి కన్సోలేషన్ బహుమతిని అందజేశారన్నారు. మెంటార్‌గా డీన్ విష్ణుమూర్తి వ్యవహరించారు. ఈ మేరకు విద్యార్థులను గురువారం డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.

కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా సందీప్


సందీప్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

హరిపురం మార్చి13 (ఆంధ్రజ్యోతి): మందస మండలం పితాతోలి గ్రామానికి చెందిన బాడ సందీప్ జాతీయ స్థాయిలో జరిగిన ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షల ఫలితాలు గురువారం రాగా 46వ ర్యాంకు సాధించి కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. సందీప్ తల్లిదండ్రులు జనార్దనరావు, సరస్వతి వ్యవసాయ కూలీలు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన సందీప్ ఉన్నత స్థాయిలో లక్ష్యాన్ని సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచాడని పలువురు కొనియాడారు. యువతకు ఆదర్శంగా నిలిచాడు. సందీప్ ఎంపికపై సర్పంచ్ సుధాగణపతి, పలువురు యువకులు అభినందించారు.

భక్తులతో పులకించిన రట్టి



హరిపురం మార్చి 13(ఆంధ్రజ్యోతి): రట్టి వల్లభనారాయణ స్వామి డోలోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు రట్టి సీతారాం, నీలకంఠం, త్రినాథ్ ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, రాత్రి కామదహనోత్సవం కనుల పండువగా చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా కామదహనం

పలాసరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): డోలో పౌర్ణమి సందర్భంగా స్థానిక ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రాజాగ్ని (కామదహన) వేడుకలను గురువారం నిర్వహించారు. మఖ నక్షత్ర ఆగమనంతో స్థానిక బంకేశ్వరి మాత ఆలయం ఎదుట కామదహనం చేశారు. అనంతరం బంకేశ్వరి మాత నిజస్థానమైన గంజాం జిల్లా దుంబుల గ్రామ ఆలయానికి వాహనాల్లో భక్తులు బయలుదేరి వెళ్లారు.

అలసత్వం వీడి లక్ష్యాలను సాధించండి

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

టెక్కలి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అలసత్వం విడనాడి లక్ష్యాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. గురువారం ఓ కల్యాణ మండపంలో జిల్లాస్థాయి రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఏ రకం ఫిర్యాదైనా నిర్ణీత గడువులోగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో జిల్లా కలెక్టర్ల సదస్సు అమరావతిలో జరగనుందని, అప్పటికి అన్ని రకాల ఫిర్యాదులు జీరో స్థాయికి చేరాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 40వేల వరకు అర్జీలు రాగా, మరో ఐదు వేల వరకు పిటిషన్లు పరిష్కారానికి ఉన్నాయని, రానున్న మూడు, నాలుగు రోజుల్లో వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలన్నారు. అర్జీదారు సంతృప్తిపడేలా పరిష్కారానికి కృషి చేయాల్సి ఉందన్నారు. మండలానికి ఓ గ్రామం పైలెట్ ప్రాజెక్ట్‌గా గతంలో తీసుకున్నామని, అయితే కొన్ని తప్పిదాలు జరిగాయని, ఈసారి పునరావృతం కాకూడదన్నారు. రెండోవిడత ప్రతి మండలానికి రెండు గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేసి అన్నిరకాల అర్జీలను పరిష్కరించాలని సూచించారు. పోర్టు వివాదాల పరిష్కారం, గ్రామసభల అర్జీలపై చొరవ చూపాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ సదస్సులో జిల్లా మొత్తం రెవెన్యూ అధికారులు, సిబ్బంది హాజరవడంతో హాలు చాలక కొందరు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవోలు ఎం.కృష్ణమూర్తి, గ్రంధి వెంకటేష్, సాయిప్రత్యూష, ఎస్‌డీసీ పద్మావతి, సర్వే ఏడీ కుప్పుస్వామి, తహసీల్దార్లు, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


‘పలాస-కాశీబుగ్గ’కు ఉద్దానం నీటిని అందించాలి

● పబ్లిక్ హెల్త్ ఎస్ఈ, ఈఈలతో కమిషనర్ సమీక్ష


కమిషనర్‌తో చర్చిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రాయల్‌బాబు, ఈఈ సుగుణాకర్

పలాస, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉద్దానం రక్షిత నీటి పథకం ద్వారా వేసవిలోగా తాగు నీరందించాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. ఈ మేరకు గురువారం పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రాయల్ బాబు, ఈఈ సుగుణాకర్‌తో తన చాంబర్‌లో ఆయన సమీక్షించారు. ఇటీవల ‘ఆంధ్రజ్యోతి’ లో మునిసిపాలిటీలో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మునిసిపల్ అధికారులతో చర్చించేందుకు వారు కార్యాలయానికి వచ్చి కమిషనర్‌తో చర్చించారు. పట్టణంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని, ఎంపీ ల్యాడ్ నిధుల్లో ఎక్కువ మొత్తం మంచినీటి పథకాలకే కేటాయించామని కమిషనర్ వారికి వివరించారు. డీఈఈ కనకరాజు, ఏఈ కిరణ్‌కుమార్ ఉన్నారు.

వసప వద్ద ఏనుగుల తిష్ఠ



కొత్తూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం వసప, కుంటిబద్ర గ్రామాల్లోని తోటల్లో నాలుగు ఏనుగులు కనిపించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజులు కిందట మన్యం జిల్లా భామిని మండలం కీసర, కొసర గ్రామాల నదీ పరీవాహక ప్రాంతం నుంచి కడుము తోటల్లో తిష్ఠవేసిన ఏనుగులు గురువారం వసప, కుంటిభద్ర గ్రామాల వ్యవసాయ పొలాలు, తోటల్లో దర్శన మిచ్చాయి. పొలాలకు వెళ్లిన ప్రజలు ఏనుగులను చూసి భయాందోళన చెంది పరుగులు తీశారు. తోటల్లో ఏనుగులు ఉండడాన్ని గుర్తించిన రైతులు గ్రామంలో చెప్పడంతో వాటిని చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. చెరకు, జొన్నపంట అధికంగా తంపర భూముల్లో ఉండడంతో ఆహారం నిమిత్తం ఏనుగులు అక్కడే తిష్ఠవేశాయని, పంటలకే కాకుండా ప్రజలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని పాతపట్నం ఫారెస్టు అధికారి పెద్దిన యశస్వి తెలిపారు. కవ్వింపులకు పాల్పడవద్దన్నారు.

సకాలంలో పార్శిళ్లు చేరలేదని బాధితుల ఆందోళన

నరసన్నపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గత 15 రోజులుగా పంపిస్తున్న పార్శిళ్లు గమ్యస్థానాలకు చేరలేరని పేర్కొంటూ పలువురు బాధితులు నిర్వాహకులను నిలదీశారు. ఈ మేరకు సదరు కొరియర్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్శిళ్లు ఎందుకు చేరడం లేదని ప్రశ్నించగా సదరు కేంద్రంలో నిర్వాహకుడు లేకపోవడం, సిబ్బంది పొంతనలేని సమాధానాలు చెబుతుండడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెచ్‌సీ దాలినాయుడు కొరియర్స్ సేవలపై ఆరా తీశారు. విలువైన డాక్యుమెంట్లు, ఇతర వస్తువులను పంపించామని, అయితే ఇంకా గమ్యస్థానానికి చేరలేదని బాధితులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ఈ వ్యవహారంపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని హెచ్‌సీ తెలిపారు.

దూకేస్తున్నా.. మా వాళ్లకు చెప్పండి

(ఐదో పేజీ తరువాయి)

చేతులు పట్టుకుని పైకి లాగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

● ఆస్పత్రిలో కౌన్సెలింగ్....

సుమారు గంటపాటు ఆస్పత్రి సిబ్బందిని, పోలీసులను, అగ్నిమాపక సిబ్బందిని ముప్పుతిప్పలు పెట్టిన నరసింహాన్ని పోలీసు ఔట్‌పోస్టుకు తీసుకెళ్లి అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. నరసింహం మద్యానికి బానిసై, మతిస్థిమితం లేకుండా మాటలు ఆడుతున్నాడని వైద్యులు తెలిపారు. పోలీసుల సమక్షంలో నరసింహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన ఆస్పత్రి సిబ్బందిని రిమ్స్ సూపరింటెండెంట్ డా.షకీల, వైద్య బృందం, పోలీసులు, అగ్నిమాపక అధికారులు అభినందించారు.

మాస్టారూ.. మీరు మారరా?

(ఐదో పేజీ తరువాయి)

చెప్పడం గమనార్హం. ఉపాధ్యాయ సంఘాలు కూడా ఆయనను వెనకేసుకు రావడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు మండిపడ్డారు. దీంతో వారు అక్కడ నుంచి జారుకున్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి.. ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినులు రాసిన లేఖ చదివి తాను చలించిపోయి కన్నీళ్లు పెట్టుకున్నానని డీఈవో తెలిపారు. ఇటువంటి ఘటనలు జరిగితే ఉపాధ్యాయులపై చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.

● ఇదిలా ఉండగా ప్రసాద్ గతంలో కంచిలి మండలం మఠంసరియాపల్లిలో పని చేస్తున్నప్పుడు ఇదే తరహా వ్యవహరించగా అప్పట్లో ఆయన్ను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్ల పాడు పాఠశాలలో చేరి అక్కడ కూడా విద్యార్థులపై ఇదే తరహాలో వ్యవహరించారు. ఉపాధ్యాయుడు కుటుంబసభ్యులు బతిమిలాడడంతో ప్రసాద్ సస్పెన్షన్ నుంచి తప్పించుకొని పెద్దసాన పాఠశాలకు ఏడాదిన్నర కిందట చేరాడు.

తాజాగా ఈ పాఠశాలలో కూడా ఇదే రీతిన వ్యవహరించి.. సస్పెన్షన్‌కు గురికావడం చర్చనీయాంశంగా మారింది. ఆ మాస్టర్.. తీరు మారదంటూ పలువురు విమర్శించారు.

న్యూస్ బాక్స్

ఫైలేరియా కిట్ల పంపిణీ

జలుమూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా బాధితుల వైద్యుల సూచనల పాటించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని జలుమూరు పీహెచ్‌సీ వైద్యురాలు ప్రసన్నలక్ష్మి అన్నారు. గురువారం పీహెచ్‌సీలో ఫైలేరియా బాధితులకు కిట్లను పంపిణీ చేశారు. అనంతరం కిడ్నీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది చిన్నరాజులు, లక్ష్మీబాయి, లక్ష్మి పాల్గొన్నారు.

అడవులకు నిప్పు పెట్టొద్దు

హరిపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అడవులకు నిప్పు పెడితే మానవ మనుగడకే ప్రమాదమని కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజర్ మురళీకృష్ణంనాయుడు అన్నారు. పెట్టువా గ్రామంలో గురువారం గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారుజ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వన్యప్రాణులు నీటి కోసం దారి తప్పి జనావాసాల్లోకి వస్తున్నాయని. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రాము, లక్ష్మణమూర్తి, వెంకటేశ్వరావు, దుర్గాదేవి, జోగారావు, సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వజ్రపుకొత్తూరు,మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పూండి సబ్ స్టేషన్ పరిధిలో కొత్త బ్రేకర్ ఏర్పాటు పనులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో పలాస ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల వరకు పూండి, పెద్దమురహరిపురం, అమలపాడు, కంబాలరాయుడిపేట, పాత టెక్కలి, కొత్తపేట, దేవునల్తాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పట్టణంలో డ్రోన్‌తో నిఘా

నరసన్నపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో పోలీసులు గురువారం రాత్రి డ్రోన్‌తో నిఘా చేపట్టారు. జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు, కళాశాల మైదానం, పట్టణ శివారున ఉన్న రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో డ్రోన్‌తో ఫొటోలను తీశారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై డేగ కన్ను వేసేందుకు డ్రోన్‌తో పరిశీలించామని సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. పట్టణంలో గంజాయి తాగే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

హిరమండలం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎస్ఎఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. 142 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుభలయ ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ లంక రోజారాణి, చింతాడ బుడ్డు, హెచ్ఎం టి.కేశవరావు, చింతాడ గిరి పాల్గొన్నారు.

● నందిగాం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): లఖిదాసుపురం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష సామగ్రిని అందించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు సమకూర్చిన సామగ్రిని హెచ్ఎం చిలుకు కృష్ణారావు అందజేశారు.

19న మార్కెట్ ఆశీలు వేలం

హిరమండలం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): హిరమండలం మేజర్ పంచాయతీ మార్కెట్‌కు ఆశీలు వేలం పాటను ఈనెల 19న నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో హరికృష్ణ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.1.30 లక్షల ధరావత్తు చెల్లించాలన్నారు. లేదా రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్ డివిజనల్ పంచాయతీ అధికారి ద్వారా పొంది రూ.30 వేలు ధరావత్తు చెల్లించి ఆశీలు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

ఐదు కేంద్రాల్లో ‘పది’ పరీక్షలు

పోలాకి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షలు ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని, దీనికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈవోలుశ్రీనివాస నాయక్, లింగరాజు తెలిపారు. 793 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

● నందిగాం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో-1 జి.నర్సింహులు తెలిపారు. నందిగాం బాలికల గురుకులం, నర్శిపురం, నౌగాం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. 418 మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో ఒక్కొక్క గ్రూపునకు 40 చొప్పున మొత్తం 160 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు.

హాల్‌టిక్కెట్ల జారీకి ఇబ్బందులు పెట్టొద్దు

అరసవల్లి/గుజరాతీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షల హాల్ టికెట్ల జారీలో ఫీజుల పేరిట విద్యార్థులను వేధింపులకు గురిచేసే పాఠశాలలపై కఠిన చర్యలకు సిఫారసు చేస్తామని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్ల జారీ ప్రక్రియ మొదలు పెట్టిందని, వాటితో విద్యార్థులు పరీక్షలు రాయవచ్చని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సరుబుజ్జిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంతో కలిసి గురువారం స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ ఆవరణలో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ చేశారు.

ఇంటర్ పరీక్షలకు 696 మంది గైర్హాజరు

గుజరాతీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు జిల్లాలో 696 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురువారం జనరల్ విభాగానికి 19,482 మందికి గాను 18,853 మంది హాజరు కాగా, 629 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యకు సంబంధించి 835 మందికి గాను 768 మంది హాజరు కాగా, 67 మంది హాజరు కాలేదు.

21 నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 21 నుంచి 23 వరకు జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీసుమిత్రా కళా సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకర శర్మ తెలిపారు. గురువారం ఆవోపా కల్యాణ మండపంలో బ్రోచర్ విడుదల చేశారు.

ఇసుక ర్యాంపులలో తనిఖీలు

ఆమదాలవలస, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దాడపేట గ్రామం వద్ద ఉన్న నాగావళి నది ఇసుక ర్యాంపులలో గురువారం టెక్కలి గనుల శాఖ ఏడీ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ముద్దాడపేట, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం ఒకటి, రెండు ఇసుక ర్యాంపులలో ఈ తనిఖీలు నిర్వహించినట్టు ఆమె తెలిపారు. ర్యాంపు నిర్వాహకులు నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు చేపట్టాలని సూచించారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ

కంచిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గొల్లకంచిలి ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన సరస్వతీ దేవి విగ్రహాన్ని గురువారం స్థానిక ఎంఇవోలు ఎస్.శివరాం ప్రసాద్, చిట్టిబాలు సమక్షంలో ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎం ఎ.లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.11.89 లక్షల ఆదాయం

పొందూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పొందూరు మేజర్ పంచాయతీకి సంబంధించి గురువారం నిర్వహించిన వేలం పాటలో రూ.11,89,000 ఆదాయం సమకూరింది. మార్కెట్ ఆశీలు రూ.11,10,000, ఆటోస్టాండ్ రూ.23,500, కబేళాను రూ.55,500కు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు రామ్మోహన్, డీఎల్‌పివో ఐవీ రమణ, ఈవోఆర్‌డీ సింహాచలం, ఈవో మోహన్‌బాబు ఉన్నారు.

ఫీడర్ అంబులెన్స్‌లో ప్రసవం


సునీతకు బిడ్డను అందిస్తున్న అజయ్

కంచిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కేబీనౌగాం గ్రామానికి చెందిన సునీత బెహరాకు గురువారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో గ్రామస్థులు ఎంఎస్‌పల్లి పీహెచ్‌సీకి సమాచారం అందజేశారు. దీంతో ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీ అజయ్ గ్రామానికి వెళ్లి.. సునీతను ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. ఆమెను సురక్షితంగా ప్రసవం చేయించిన అనంతరం ఆసుపత్రికి తరలించి వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా అజయ్‌ను స్థానికులు అభినందించారు.

నూజివీడు పరిధిలో క్వాలిటీ విభాగం

శ్రీకాకుళం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో జరిగే పనుల నాణ్యతను పరిశీలించేందుకు శ్రీకాకుళం, విజయనగరం క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని నూజివీడు పరిధిలో ప్రభుత్వం చేర్చింది. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు.

నేరాల నియంత్రణపై దృష్టి: ఎస్పీ

ఇచ్ఛాపురం, మార్చి13(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నేరాల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని.. వాహన తనిఖీలు నిరంతరం విస్తృత స్థాయిలో నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం రూరల్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఆయన పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. సరిహద్దులో పేకాట నిరోధంపై దృష్టి పెట్టాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ మీసాల చిన్నమనాయుడు, ఎస్ఐలు ముకుందరావు, శ్రీనువాసరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కంచిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కేబీనౌగాం గ్రామం వద్ద గురువారం అటవీ శాఖాధికారులు స్థానిక గిరిజనులకు అడవులలో జరిగే అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువయ్యే సమయాల్లో అడవులలో కార్చిచ్చు ఏర్పడితే, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అటువంటి సమయాల్లో ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

శతశాతం పన్నులు వసూలు చేయాలి

ఇచ్ఛాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో పన్నుల వసూళ్లను శతశాతం పూర్తి చేయాలని కమిషనర్ ఎస్.రమేష్ అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బకాయిలను కూడా త్వరితగతిన వసూలు చేయాలని కమిషనర్ ఆదేశించారు.

చెక్‌పోస్ట్ వద్ద అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

ఇచ్ఛాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా కాకుండా పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సరిహద్దు చెక్‌పోస్టును కమిషనర్‌తో పాటు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతి నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒడిశా నుంచి ఆంధ్రాకు, ఆంధ్రా నుంచి ఒడిశాకు వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా రాత్రిపూట అప్రమత్తంగా ఉండి వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. గంజాయి, ఒడిశా నాటు సారా అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలన్నారు. ఒడిశా నుంచి వచ్చిన వాహనాలను కమిషనర్ దగ్గరుండి సిబ్బందితో తనిఖీలు చేయించారు. అనంతరం ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించి... రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా.. నాటుసారా, ఒడిశా మద్యం, గంజాయికి అడ్డుకట్ట వేయకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్, మొబైల్ పెట్రోలింగ్ పార్టీ ఇన్‌స్పెక్టర్ జీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మొల్ల రచనలు స్ఫూర్తిదాయకం


మొల్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్ల రచనలు మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని నగర పాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాద్ అన్నారు. బలగలోని భద్రమ్మ కాళీ దేవాలయం పక్కన ఉన్న కవయిత్రి మొల్ల గుడిలో గురువారం ఆమె జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొల్ల రచనలు స్త్రీ జాతిని చైతన్యపరిచాయని కీర్తించారు. ఈ కార్యక్రమంలో గుడి ధర్మకర్త లక్ష్మీనారాయణ, సహాయ కమిషనర్ వై.వి.శివకుమార్, లాయర్ శ్రీను, అప్పలనాయుడు, టి.సురేష్, టి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి అనూరాధ, డీఎస్‌ఓ, సంఘ నాయకులు, పెద్దలు మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీరాస్వామి, ఎర్రన్న, స్వామి, మల్లేసు, సూర్యనారాయణ, గణపతి పాల్గొన్నారు.

నేడు చక్రధరుని డోలోత్సవం


చక్రధరుని ఉత్సవ విగ్రహం

కవిటి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసిన శ్రీచక్రధర పెరుమాళ్ల స్వామి డోలోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు ధర్మకర్తలు, కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా ఫాల్గుణ మాస పౌర్ణమి రోజున స్వామివారి డోలోత్సవ యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. మరోవైపు స్వామివారి తృతీయ బ్రహోత్సవాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. యాత్ర జరిగిన తర్వాత రోజు కామదహనోత్సవంతో డోలోత్సవాలు ముగుస్తాయి. వందల ఏళ్ల చరిత్ర గల ఈ ఉత్సవాలకు పరిసర ప్రాంతాలు, ఒడిశా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు.

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగన్నాథ స్వామి దేవాలయంలో శుక్రవారం నిర్వహించనున్న డోలోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవం కోసం బెల్లుపడ కాలనీలో ఉన్న డోలా మండపాన్ని ఆలయ మేనేజర్ బెండి రామారావు పర్యవేక్షణలో రంగులతో తీర్చిదిద్దారు. స్థానిక కోదండ రామ, లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాల్లోనూ ఈ ఉత్సవాలు జరుగుతాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎచ్చెర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జరజాం రోడ్డులో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుని వయసు సుమారు 40 ఏళ్లు కలిగి, చామన ఛాయ రంగులో ఉన్నాడు. మృతదేహంపై నలుపు చొక్కా ఉంది. మృతుని వివరాలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

న్యూఢిల్లీలో నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన ఇస్తున్న రామకౌండిన్య

గార/శ్రీకాకుళం కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మానికి చెందిన శ్రీభాష్యం రామకౌండిన్య న్యూఢిల్లీలో బుధవారం రాత్రి నృత్య ప్రదర్శనతో అక్కడి వారిని ఆకట్టుకున్నారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించిన సీసీఆర్‌టీ టీచర్స్ కమ్ ఒరియంటేషన్ కార్యక్రమంలో కూడా రామకౌండిన్య పాల్గొన్నారు. ఇందులో భాగంగా చివరి రోజు బుధవారం రామకౌండిన్య కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఐసీసీఆర్ ఇన్‌చార్జి అర్చ న, సీసీఆర్‌టీ డైరెక్టర్ రాహు ల్ నుంచి ప్ర శంసా పత్రాన్ని అందుకున్నట్టు ఆయన తెలి పారు. ఐక్యం-2025 నృత్యోత్స వాల్లో భాగంగా ఈ నెల 9న కూడా నృత్య ప్రదర్శనలో పాల్గొన్నట్టు రామకౌండిన్య చెప్పారు.

'ఉపాధి'లో తప్పిదాలపై చర్యలు తప్పవు

- డ్వామా పీడీ సుధాకరరావు


అధికారులను ప్రశ్నిస్తున్న వేణుగోపాలరావు

పొందూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులపై నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్‌లో గుర్తించిన తప్పిదాలపై సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు హెచ్చరించారు. మండలంలో 2023- 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల ఆడిట్ నివేదికలపై స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం ప్రజావేదిక నిర్వహించారు. తుంగపేటలో ఎండీఎం నిర్వాహకురాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఉపాధి పనులకు వెళ్లినట్టు మస్తర్లు వేసి.. వేతనాలు చెల్లించారని, దీనిపై ఆడిట్‌లో ఏం తేల్చారని సర్పంచ్ పప్పల వేణు అధికారులను ప్రశ్నించారు. గోకర్ణపల్లి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ విధులకు వెళ్లక నాలుగు నెలలవుతున్నా ఎందుకు తొలగించలేదని మాజీ ఎంపీటీసీ సీపాన శ్రీరంగనాయకులు ప్రశ్నించారు. గత సోషల్ ఆడిట్‌లో జరిగిన తప్పిదాలకు ఎవరిపైన చర్యలు తీసుకున్నారని పలువురు నాయకులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నామని పీడీ తెలిపారు. ప్రజా వేదికలో ఎంపీపీ ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షులు రామ్మోహన్, ఏపీడీ పంచాది రాధ, ఎంపీడీవో మన్మథరావు, ఏపీవో శ్రీనివాసరావు, ఎస్‌ఆర్‌పీ పున్నయ్యానాయుడు పాల్గొన్నారు.

జీకే వలసలో కుంకుమ పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

ఆమదాలవలస, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జీకేవలసలో సీతారామ స్వామి విగ్రహ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం మండపారాధాన, క్షీరాధివాసం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. వేద పండితులు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో విగ్రహాలకు అభిషేకాలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

పురపాలక సంఘ కార్యాలయము పలాస-కాశీబుగ్గ

రేఖా నం. 368/2023-ఎ1, తే 12/03/2025

బహిరంగ వేలం రెండవ నోటీసు

పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘమునకు సంబంధించిన ఈ దిగువ తెలిపిన వేలం పాటలకు తే 19/03/2025 దీ న ఉదయం 11.30 ని.లకు పురపాలక సంఘ కమీషనరు వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో నిర్వహించబడు బహిరంగ వేలంలో పాల్గొనుట కొరకు నిర్ణీత నమూనాలో తే 18/03/2025దీ నాటి సాయంత్రం 5.00 గం.లోగా ధరఖాస్తులు కోరబడుచున్నవి.

వ. సం.	ఖాళీ షాపు రూము నెంబర్లు	వేలం ధరావత్తు రూ.	సాల్వెన్సీ సర్టిఫికేట్ మొత్తం రూ.	రిజిస్ట్రేషన్ చార్జీలు
1.	తే 01/04/2025 దీ నుండి 31/03/2026 దీ వరకు పురపాలక సంఘ పరిధిలో గల రోజువారి మార్కెట్ మరియు బస్‌స్టాండు, కార్ స్టాండులో ఆశీలు ఫీజులు వసూలు చేసుకొనే హక్కు మరియు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో గల వీధులలోని అమ్మ చూపే వస్తువులపై ఫీసులు వసూలు చేసుకొనుటకు	2,00,000/-	10,00,000/-	
2.	తే 01/04/2025 దీ నుండి 31/03/2026 దీ వరకు జంతు వధశాల (కబేళా)లో నిర్ణీత ఫీజు వసూలు చేసుకొనే హక్కు	1,000/-	50,000/-	
3.	పాతవార్తా పత్రికలు అమ్మకం (2023-24 సంవత్సరమునకు సంబంధించినవి)	200/-		
4.	ఐ.డి.యస్.యం.టి షాపింగు కాంప్లెక్సు, కాశీబుగ్గలో ఖాళీగా ఉన్న షాపు రూములు గుడ్‌విల్ పద్ధతిపై లీజుకిచ్చుటకు 1. ఎస్‌సి కేటగిరి: 39,41 2. యస్‌టి కేటగిరి: 35 3. జనరల్ కేటగిరి: 37,38,40	20,000/-	30,000/-	
5.	సీతమ్మ తల్లి షాపింగు కాంప్లెక్సు, పలాస 1. ఎస్‌టి కేటగిరి: 01 2. జనరల్ కేటగిరి: 4,9,10,12, 13,15	5,000/-	10,000/-	
6.	మహాత్మా గాంధీ పునరావాస షాపింగు కాంప్లెక్సు, కాశీబుగ్గ: 1. ఎస్‌సి కేటగిరి: 56,59 2. జనరల్ కేటగిరి: 31,32,34,35, 45,46,48,51,53,54,55,57,58,60	5,000/-	10,000/-	

షరతులు:-

1. దినవారీ మార్కెట్ ఆశీలు వసూలు కొరకు దాఖలు చేసుకొనుచున్న దరఖాస్తుదారులు మీ యొక్క దరఖాస్తుతో పాటుగా రూ. 100/- విలువ గల ఎన్.జె. స్టాంపు పేపరు మరియు సాల్వెన్సీ సర్టిఫికేటు తే 18/03/2025 దీ సా. గం. 5.00ల లోగా దాఖలు చేయవలెను.
2) తే 27/01/2025 దీ తరువాత తీసిన ఎనకంబ్రెన్స్ సర్టిఫికేట్లు మాత్రమే చెల్లుబాటు అగును.
3) మిగతా వివరములకు కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.
4) మార్కెట్ కిస్తీకి సంబంధించిన (సాల్వెన్సీ యొక్క) ఒరిజినల్ డాక్యుమెంట్సుతో సహా బహిరంగ వేలంనకు హాజరు కావలెను.

కమీషనరు,
పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం





సాంకేతికతతో సేవల విస్తరణ


డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ సేవలను సాంకేతికతతో విస్తరించనున్నామని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. అధునాతన సాంకేతికత కోసం నింబస్ సంస్థ (చెన్నై) తీసుకువచ్చిన వన్ నేషన్, వన్ సబ్‌స్క్రిప్షన్ డిజిటల్ లైబ్రరీ ప్లాట్‌ఫారం వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయంగా నాణ్యమైన, పరిశోధనాత్మక వ్యాసాలు ప్రచురించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం.అనూరాధ, ఎస్‌వో డాక్టర్ ఎస్.సామ్రాజ్యలక్ష్మి, ఓఎస్‌డీ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, హానరరీ లైబ్రేరియన్ డాక్టర్ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల పరిశీలన

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో న్యాయ విద్యార్థులకు 1, 3, 5, 7, 9 సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలను గురువారం వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ అడ్డయ్య పరిశీలించారు.



